నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలి

- రైతులకు వ్యవసాయాధికారుల సూచన
- గ్రామాల్లో విత్తనాల ఎంపిక, పంటల సాగుపై అవగాహన

ఖానాపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న రూరల్ ఏడీఏ ప్రదీప్‌కుమార్

ఖానాపూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న రూరల్ ఏడీఏ ప్రదీప్‌కుమార్

సారంగాపూర్/ సిరికొండ/ కోటగిరి/ వేల్పూర్/ భీమ్‌గల్/ మాక్లూర్/ మోర్తాడ్/ముప్కాల్, మే 30: వానకాలం సీజన్‌లో పంట సాగు కోసం రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల్లో వ్యవసాయాధికారులు రైతులతో గురువారం సమావేశాలు ఏర్పాటు చేసి విత్తనాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటల సాగుపై సూచనలు చేశారు.

నిజామాబాద్ రూరల్ మండలంలోని ఖానాపూర్ గ్రామంలో రూరల్ ఏడీఏ ప్రదీప్‌కుమార్ రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. లైసెన్స్ కలిగి ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని, రసీదు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏఈవో జ్ఞానేశ్వర్‌రెడ్డి, నాయకులు కోర్వ రాజేంద్రప్రసాద్, నరేందర్, అబ్బన్న, గంగాధర్, సాయికుమార్, గంగమల్లు, భాస్కర్, ప్రతాప్, రైతులు పాల్గొన్నారు.

సిరికొండ మండలంలోని చిన్నవాల్గోట్, సర్పంచ్ తండా, గోప్యా తండా, తాటిపల్లి గ్రామాల్లో ఏఈవోలు కృష్ణారెడ్డి, శివాణి, శ్రీకాంత్ రైతులతో సమావేశం నిర్వహించారు. విత్తనాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటల సాగుపై అవగాహన కల్పించారు.

కోటగిరి మండల కేంద్రంలోని చావిడి వద్ద రైతులకు విత్తనాలపై మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రావు, ఏఈవో ఆస్మాబేగం రైతులకు అవగాహన కల్పించారు. రైతులతో సదస్సు నిర్వహించి సూచనలు చేశారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని భీమ్‌గల్ ఏడీఏ మల్లయ్య డీలర్లను ఆదేశించారు. వేల్పూర్ మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను వ్యవసాయశాఖ అధికారులు, పోలీసులు గురువారం తనిఖీ చేశారు. భీమ్‌గల్ ఏడీఏ మల్లయ్య మాట్లాడుతూ గుర్తింపు పొందిన కంపెనీల నుంచి మాత్రమే విత్తనాలు తీసుకొచ్చి రైతులకు అమ్మాలని, సీడ్ కొనుగోలు చేసిన ప్రతి రైతుకూ రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. కాలవ్యవధి దాటిన విత్తనాలు, పురుగు మందులు, నకిలీ విత్తనాలు అమ్మితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి నర్సయ్య, ఎస్సై వినయ్ పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలను ఎమ్మార్పీకి విక్రయించాలని భీమ్‌గల్ ఏవో సాయికృష్ణ అన్నారు. భీమ్‌గల్ మండలంలోని పలు గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాల్లో వ్యవసాయాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయాశాఖ అధికారులు లక్పతి, దివ్య, భార్గవ్ పాల్గొన్నారు.

మాక్లూర్ మండల కేంద్రంలోని పలు విత్తనాల షాపులను ఏవో తనిఖీ చేశారు. కల్తీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం లోగా కల్లెడి, మాక్లూర్ సొసైటీలకు

మాక్లూర్‌లో రిజిస్టర్ పరిశీలిస్తున్న ఏవో పద్మ

జీలుగ విత్తనాలు వస్తాయని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు.

ముప్కాల్ మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను ఏవో రాజ్‌కుమార్, ఎస్సై భాస్కరాచారి తనిఖీ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని, ధరల పట్టిక ఏర్పాటు చేయాలని సూచించారు.

కొనసాగుతున్న తనిఖీలు

మోర్తాడ్ మండలంలోని పలు గ్రామాల్లోని ఫర్టిలైజర్‌షాపులను వ్యవసాయాధికారులు తనిఖీ చేశారు. విత్తనాల విక్రయం, రసీదులు ఇవ్వడం, రిజిస్టర్‌లో రైతుల పేర్లు నమోదు చేయడం తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమాల్లో ఏవో లావణ్య, ఏఈవోల రంజిత్, మోహన్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

గోన్‌గొప్పులలోని ఫర్టిలైజర్ షాపులో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఏఈవో దివ్య

ముప్కాల్‌లో విత్తనాలను పరిశీలిస్తున్న ఎస్సై, ఏవో

జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

కోటగిరిలో గొర్రెకు టీకా వేస్తున్న డాక్టర్ సురేశ్‌కుమార్

కోటగిరి, మే 30 : గొర్రెలు, మేకలకు వానకాలంలో చిటుక వ్యాధి నిరోధక టీకాలు తప్పని సరిగా వేయించాలని డాక్టర్ సురేశ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో గొర్రెలు, మేకలకు చిటుకవ్యాధి నిరోధక టీకాలు గురువారం వేశారు. ఉమ్మడి కోటగిరి మండలంలో 15 రోజుల పాటు ఇంటింటికీ తిరిగి జీవాలకు ఉచితంగా టీకాలు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎత్తొండ పశువైద్య సహాయకురాలు మంజుల, కోటగిరి వెటర్నీరీ అసిస్టెంట్ సుధీర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్యను మరింత పెంచాలి

కోటగిరి, మే 30 : ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను మరింత పెంచాలని కోటగిరి ఎంపీడీవో మనోహర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ సమావేశ హాలులో పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా, గ్రామాల్లోని కంపోస్ట్ షెడ్లను వినియోగించాలని సూచించారు. నర్సరీలో మొక్కల సంరక్షణకు కృషిచేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో మారుతి, ఏపీవో గంగారాం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బైక్ బ్యాటరీలు చోరీ

వినాయక్‌నగర్, మే 30 : జిల్లాకేంద్రంలో ద్విచక్రవాహనాల పెట్రోల్, బ్యాటరీల దొంగతనాలు నిత్యకృత్యంగా మారాయి. అక్రమ సంపాదనకు అలవాటుపడిన దుండగులు రాత్రివేళల్లో తమ పనికానిస్తున్నారు. ద్విచక్రవాహనాలు, కార్లు, ఆటోలు, పెట్రోల్, డీజిల్ ఏది దొరికితే అది చోరీ చేయడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నిజామాబాద్ జిల్లా రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మారుతీనగర్ కాలనీలో ఓ ఇంటి ఎదుట పార్క్ చేసి ఉంచిన రెండు ద్విచక్రవాహనాలను ధ్వంసం చేసి బ్యాటరీలను దుండగులు బుధవారం రాత్రి చోరీ చేశారు. పోలీసులు రాత్రివేళ పెట్రోలింగ్ నిర్వహించకపోవడంతోనే చోరీలు జరుగుతున్నాయని, పోలీసులు చోరీలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపకార వేతనానికి రాంపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ఎంపిక

డిచ్‌పల్లి, మే 30 : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ (ఎన్ఎంఎంఎస్) స్కాలర్‌షిప్ కోసం రాంపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎంపికయ్యారు. డిసెంబర్‌లో నిర్వహించిన పరీక్షలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినులు నల్లవెల్లి రుత్విక, ఎర్రమొల్ల నిహారిక ప్రతిభచూపి ఎంపికైనట్లు హెచ్ఎం కొండ గోవర్ధన్ తెలిపారు. విద్యార్థినులకు ఏడాదికి రూ. 12 వేల చొప్పున 4 సంవత్సరాల పాటు రూ. 48 వేలు ఉపకార వేతనం అందుతుందని తెలిపారు.

కొనసాగుతున్న అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ఖలీల్‌వాడి, మే 30 : జిల్లాలో ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఎకనామిక్స్, ఫిజిక్స్ పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రవికుమార్ తెలిపారు. మొదటి సంవత్సరంలో 5,291 మంది విద్యార్థులకు గాను 4,955 మంది హాజరు కాగా.. 370 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. రెండో సంవత్సరంలో 2,504 మంది విద్యార్థులకు గాను 2,355 మంది హాజరుకాగా.. 149 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్

ట్రాక్టర్లను సీజ్ చేస్తున్న తహసీల్దార్ వెంకటేశం

రుద్రూర్, మే 30 : మండలంలోని చిక్కడ్‌పల్లి చెరువు నుంచి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు, పొక్లెయిన్‌ను గురువారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ వెంకటేశం తెలిపారు. చిక్కడ్‌పల్లి చెరువులో పొక్లెయిన్ సహాయంతో ఆరు ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. రుద్రూర్ తహసీల్దార్‌కు సమాచారం అందజేయగా.. ఘటనాస్థలానికి సిబ్బందితో చేరుకున్న తహసీల్దార్ వెంకటేశం.. మట్టి తరలిస్తున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు ట్రాక్టర్లు, ఒక పొక్లెయిన్‌ను సీజ్ చేసి రుద్రూర్ ఎస్సై అప్పారావుకు అప్పగించారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

ఆర్మూర్‌టౌన్, మే30: కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీపీఎంఎల్ మాస్‌లైన్(ప్రజాపంథా) రాష్ట్ర నాయకుడు హన్మేశ్ అన్నారు. మండలంలోని పిప్రి గ్రామంలో మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ రాజకీయ శిక్షణ తరగతులు గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారుల అక్రమార్జనను కాపాడేందుకు బీజేపీ పనిచేస్తోదన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏఐపీకేఎస్, ఏఐపీకేఎంఎస్, ఐఎఫ్‌టీయూ, పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో సీనియర్ జర్నలిస్టు మృతి

ప్రదీప్

రెంజల్, మే 30: మండలంలోని కళ్యాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు చింత ప్రదీప్ (38) అనారోగ్యంతో గురువారం తెల్లవారు జామున మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. చింత ప్రదీప్ వివిధ పత్రికల్లో సబ్ ఎడిటర్‌గా పని చేశాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

ట్రాక్టర్, బైక్ ఢీ.. వ్యక్తి దుర్మరణం

ఎడపల్లి, మే 30: ఠానాకలాన్ గ్రామ శివారులో గురువారం ట్రాక్టర్, బైక్ ఢీకొని ఒకరు మృతి చెందారు. ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని రాంపూర్ చెరువు నుంచి ఠానాకలాన్‌కు చెందిన రవీందర్ ట్రాక్టర్‌తో నల్ల మట్టిని తరలిస్తున్నాడు. నిజామాబాద్‌కు చెందిన హన్నీఫ్ (36) బైక్‌పై ఎల్లారెడ్డి తాండూర్ గ్రామంలోని అత్తగారింటికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఠానాకలాన్ శివారులో మూల మలుపు వద్ద బైక్, ట్రాక్టర్ ఢీకొన్నాయి. దీంతో హన్నీఫ్ బైక్‌పై నుంచి కింద పడగా తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య యాసిన్ బేగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

నవీపేట,మే 30: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వృద్ధురాలు చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 29న పాల్దా గ్రామంలో మోటర్ సైకిల్ ఢీకొట్టడంతో నిజామాబాద్ మండలంలోని కాలూరు గ్రామానికి చెందిన తాడెం ఎల్లవ్వ(72) తీవ్ర గాయాలపాలైంది. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి చెల్లె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెట్ల నరికారు.. కొమ్మలు రోడ్డుపై వదిలేశారు

రోడ్డు పక్కనే వదిలేసిన చెట్ల కొమ్మలు

ఆర్మూర్‌టౌన్, మే30: చెట్ల కొమ్మల తొలగింపులో మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. పట్టణంలోని పోస్టాఫీస్ ఆవరణలో రోడ్డు పక్కన చెట్టుకొమ్మలు కుప్పగా పేరుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు అడ్డు రావడంతో వాటిని నరికి వేశారు. నరికిన చెట్ల కొమ్మలను రోడ్డుపై వదిలివేశారు. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి చెట్ల కొమ్మలను తొలగించాలని కోరుతున్నారు.

ఉద్యోగార్థులకు మెలకువలు

భీమ్‌గల్, మే 30: ప్రభుత్వ ఉద్యోగుల కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ప్రభుత్వ ఉపాధ్యాయులు అండగా నిలిచారు. మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో పరీక్షల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉపాధ్యాయులు పలు విషయాలపై మెలకువలు నేర్పించారు. కార్యక్రమంలో జాగిర్యాల్ పీజీహెచ్ఎం కళావతి, ఉపాధ్యాయులు అరవింద్, శ్రీధర్, గంగామహేశ్, దాసు పాల్గొన్నారు. వీరిని లైబ్రేరియన్ గంగాధర్‌గౌడ్ అభినందించారు.

ఇందూర్ హైస్కూల్‌కు అవార్డు

ప్రశంసాపత్రం, జ్ఞాపికతో కిశోర్ కుమార్

బోధన్, మే 30: పట్టణంలోని ఆచన్‌పల్లి శివారు ఇందూర్ హైస్కూల్‌ను 'ఇంటర్నేషనల్ బ్రిలియన్స్' అవార్డుకు న్యూఢిల్లీకి చెందిన 'హై ప్లెడ్జ్ మీడియా గ్రూప్' ఎంపిక చేసింది. ఈ పాఠశాల 15 ఏండ్లుగా బెస్ట్ అవైలబుల్ స్కూల్‌గా, ప్రభుత్వంతో కలిసి పనిచేయడం, ఎన్‌సీసీ, స్కౌట్, అటల్ టింకరింగ్ ల్యాబ్ కలిగి ఉండడం ఈ పాఠశాలలోని ప్రత్యేకతలు. ఎన్‌సీసీ విభాగంలో నేషనల్ పరేడ్‌కు రెండు పర్యాయాలు ఎంపికైంది. సైన్స్‌ఫేర్‌లో జాతీయ స్థాయి బహుమతులను పాఠశాల విద్యార్థులు సాధించారు. ఈ పాఠశాలను 'బెస్ట్ స్కూల్ ఆఫ్ ద ఇయర్ – 2024'కు, ఇంటర్నేషనల్ బ్రిలియన్స్ అవార్డుకు ఎంపిక చేశారు. ఇందులో భాగంగా 'హై ప్లెడ్జ్ మీడియా గ్రూప్' వారు ఈ పాఠశాలకు ప్రశంసాపత్రాన్ని, అవార్డును, మెమొంటోను పోస్ట్ ద్వారా పంపారు. తమ పాఠశాలకు అంతర్జాతీయ అవార్డు దక్కడం ఎంతో సంతోషంగా ఉందని ఇందూర్ విద్యా సంస్థల కరెస్పాండెంట్ కొడాలి కిశోర్ అన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఆర్మూర్‌టౌన్, మే30: పెర్కిట్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో పేకాటాడుతున్న 11 మందిని గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.94,600 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేశారు.

స్కూల్ యూనిఫామ్ కుట్టు మిషన్ కేంద్రం తనిఖీ

గుత్పలో కుట్టుమిషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో సాయగౌడ్

మాక్లూర్, మే 30: మండలంలోని గుత్ప గ్రామంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ–డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి కుట్టు మిషన్ కేంద్రాన్ని డీఆర్డీవో సాయాగౌడ్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కుట్టుమిషన్ కేంద్రంలో ఉన్న పాఠశాల స్కూల్ యూనిఫామ్‌లను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల యూనిఫామ్ కుడుతున్న మహిళలకు సూచనలు అందజేశారు. ఆయన వెంట డీపీఎం సాయిలు, ఏపీఎం అనిల్‌కుమార్, సీసీ దీపారాణి, వీవోఏలు, సిబ్బంది ఉన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

శక్కర్‌నగర్/రెంజల్, మే 30: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా కొనసాగుతున్న మరమ్మతులు, సౌకర్యాల కల్పనలో భాగంగా చేపట్టిన పనులు నాణ్యతా ప్రమాణాలతో చేయించాలని పబ్లిక్ హెల్త్ ఈఈ తిరుపతి కుమార్ సూచించారు. గురువారం ఆయన బోధన్ పట్టణంలోని పలు పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, ఏఈ శ్రీనివాస్‌కు పలు సూచనలు చేశారు. పాఠశాలల్లో కొనసాగుతున్న పనులు నిత్యం పర్యవేక్షించాలని, ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పనులు పూర్తయ్యేలా చూడాలని అన్నారు. మొదటి ప్రాధాన్యతగా మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణాలు పూర్తి చేయించాలన్నారు. పట్టణంలో సుమారు 10 పాఠశాలల్లో పనులను పరిశీలించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

బోధన్‌లో కొనసాగుతున్న పనులను పరిశీలిస్తున్న పబ్లిక్ హెల్త్ ఈఈ తిరుపతి కుమార్

రెంజల్ మండలంలోని దూపల్లి, బాగేపల్లి, కునేపల్లి, దండిగుట్ట, గ్రామాల పాఠశాల మరమ్మతు పనులను జేడీఏ, మండల ప్రత్యేక అధికారి వాజిద్‌హుస్సేన్ తనిఖీ చేశారు. గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో గణేశ్‌కులకర్ణి ఉన్నారు.

వంగిపోయిన విద్యుత్ స్తంభం

తక్కువ ఎత్తులో విద్యుత్ వైర్లు

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

నందిపేట్, మే 30: మండలంలోని బజార్ కొత్తూర్ గ్రామంలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. హనుమాన్ మందిరం సమీపంలోని కాలనీలో ఉన్న నివాస ప్రాంతంలో పంటపొలాల మధ్య ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం పక్కకు వంగిపోవడంతోపాటుగా తీగలు వేలాడుతున్నాయి. ఈదురుగాలులు వీచిన పుడు స్ప్రార్కింగ్ వస్తోందని, విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతోందని గ్రామస్తులు తెలిపారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి స్తంభాలతోపాటు విద్యుత్ తీగలను సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మొరం తవ్వకాలను అడ్డుకున్న అధికారులు

ఎడపల్లి, మే 30: మండలంలోని ఠాణాకలాన్ గ్రామ శివారులో గురువారం కొందరు వ్యక్తులు ట్రాక్టర్, జేసీబీలతో మొరం అక్రమ తవ్వకాలు చేపట్టారు. పక్కా సమాచారంతో ఆర్ఐ వినోద్‌కుమార్ మొరం తవ్వకాల ప్రాంతానికి చేరుకుని ట్రాక్టర్ 'టీఏస్16ఈపి5792), జేసీబీ (ఏపీ25ఎం2870)ని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కె.ధన్వాల్ మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా మొరం, ఇసుక వంటివి తరలిస్తే వాహనాలను సీజ్ చేసి కఠిన చర్యలు చేపడుతామని హెచ్చరించారు.

శ్రీనివాసనగర్‌లోని ఓ ఇంట్లో చోరీ

శక్కర్‌నగర్, మే 30: బోధన్ పట్టణ పరిధిలోని శ్రీనివాస్ నగర్‌లోని ఓ ఇంట్లో గుర్తు దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంటి యజమాని నాగం పాటి శ్రీనివాస్ అతని కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 29న రాత్రి ఇంటికి తాళం వేసి మేడపై నిద్రించాడు. గురువారం ఉదయం కిందికి వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా ధ్వంసం చేసినట్లు గుర్తించారు. ఈ సంఘటనపై బోధన్ పట్టణ పోలీసులకు బాధితుడు శ్రీనివాస్ సమాచారం అందించారు. రెండు తులాల బంగారు, 20 తులాల వెండి ఆభరణాలతోపాటు రూ. 15వేలు నగదు చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

మున్సిపల్ కార్యాలయంలో ఆడిట్

ఆడిట్ నిర్వహిస్తున్న సిబ్బంది

ఆర్మూర్‌టౌన్,మే30: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం మెప్మా సమాఖ్యల ఆడిట్‌ను సీఏ సాయి చరణ్ నిర్వహించారు. సీఏ సాయి చరణ్ బృందం సభ్యులతో కలిసి 2023–2024 సంవత్సరానికి గాను మెప్మా సమాఖ్యల ఆడిట్‌ను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ ఉదయ్‌శ్రీ, సీవో రాజలింగం, సమాఖ్యల అధ్యక్షులు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

బోధన్‌లో వైద్య శిబిరం

శక్కర్‌నగర్, మే 30: బోధన్ పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద ఓ ప్రైవేట్ పాఠశాలలో జీవన్‌సేవ వెల్‌నెస్ గ్రూప్ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యపరీక్షలు, మసాజ్ థెరపీ, ఆక్యూప్రెషర్ థెరపీ, నేచురోపతి చికిత్సలు చేశారు. న్యూరో పెయిన్ థెరపీ నిపుణుడు చంద్రశేఖర్, నేచురోపతి వైద్యులు నాగనాథ్, సదానంద్ గౌడ్, హకీం, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన

బోధన్ రూరల్, మే 30: బోధన్ మండలంలోని బెల్లాల్ గ్రామంలో గురువారం వైద్య సిబ్బంది క్షయ (టీబీ) నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు యాక్టివ్ కేసులున్న వారికి ఇంటింటికీ తిరిగి క్షయ నిర్ధారణ పరీక్షలు చేశారు. పాత కేసులు ఉన్న వారిని, మొత్తం తగ్గిపోయిన వారిని, లక్షణాలు ఉన్నవారిని గుర్తించినట్లు సూపర్‌వైజర్ మహ్మద్ అహసన్ తెలిపారు. టీబీ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. కార్యక్రమంలో టిబి ల్యాబ్ సూపర్‌వైజర్ పద్మ, ఏఎన్ఎం సంధ్యారాణి, నాగజ్యోతి, రజిత, అరుణ,శోభ, స్వరు పతదితరులుఉన్నారు.

అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

డాక్యుమెంట్స్ పోయినవి

★నా పేరు సామల చంద్రకళ భర్త నారాయణ రెడ్డి ఇనెం.3-66 గ్రామము శంతాపూర్ నా యొక్క స్థిరాస్తి డాక్యుమెంట్స్ నెం.2247/2014కు సంబంధించిన సర్వే నం.513/1, 513/2 బిమ్మంద బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్నప్పుడు నా బ్యాగు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. కావున ఎవరికైన దొరికినచో నెంబర్ కు సెల్: 80089 51075.
NTZ-324695

శుభవార్త

★నిరుద్యోగ యువతి, యువకులకు జీవితంలో ఆర్థికంగా స్థిరపడే గొప్ప వ్యాపార అవకాశం కలదు. ఆసక్తి గల వారు వెంటనే సంప్రదించండి: సెల్: 9059962194.
NTK-311380

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

భీమ్‌గల్ మండలంలోని పురాణిపేట్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా గ్రామ శివారులోని పెద్దమ్మతల్లి ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు.
– భీమ్‌గల్, మే 30

నేడు మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం

ఆర్మూర్‌టౌన్,మే30: మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీకి నూతనంగా చైర్‌పర్సన్ ఎన్నికైన తర్వాత మొదటిసారి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.